క్లుప్తంగా

బాబు పాపాలు బయట పడుతున్నాయి !


శిరీషా

సైదాపురం: టీడీపీ అధినేత చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చేసిన పాపాలు ఇప్పుడు బయటపడుతున్నాయని రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పోట్లేళ్ల శిరీషా అన్నారు. సైదాపురంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేస్తే దాన్ని రాజకీయం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, చంద్రబాబుకి కోర్టు విధించిన రిమాండ్ రుజువు చేసిందన్నారు. బాబు అరెస్టు చేయడంతో వెంకటగిరి ఎమ్మెల్యే రామనారాయణరెడ్డి మీడియా ఎదుట నానా హడావుడి చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం


విరాళం అందజేస్తున్న రామ్మోహన్‌రావు

గూడూరురూరల్: పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం రూ.50,116 విరాళంగా అందించినట్లు ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు తెలిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందామన్నారు. తన కుమార్తె, అల్లుడు, మనుమడు ఆర్యన్ పేరున ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డికి విరాళం అందజేశామని చెప్పారు.

కండలేరులో 13.307టీఎంసీల నీరు

రాపూరు:కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 13.307 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 25, లోలెవల్ స్లూయిస్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కార్మికుల బస్సులు అడ్డుకున్న టీడీపీ నేతలు


టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ

దొరవారిసత్రం: సింగనాలత్తూరులోని సూళ్లూరుపేట-కోట రోడ్డుపై సోమవారం ఉదయం టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పరిశ్రమలకు వెళ్లే కార్మికుల బస్సులను అడ్డుకుని నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తిరుమలరావు సిబ్బందితో వెళ్లి 144 సెక్షన్ అమలులో ఉందని, నిబంధనలు ఉల్లగిస్తే చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించడంతో టీడీపీ నాయకులు బస్సులకు అడ్డు తప్పుకున్నారు. కార్మిక బస్సులన్నీ యథావిధిగా పరిశ్రమలకు వెళ్లేలా పోలీసుల చర్యలు చేపట్టారు. బస్సులను అడ్డుకున్న మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులనాయుడుతో పాటు పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బంద్ ఊసే లేదు!


సూళ్లూరుపేటలో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు


గూడూరులో పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

సూళ్లూరుపేట: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు. చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినందుకు నిరసనగా టీడీపీ రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చినప్పటికీ ప్రజల్లో ఎలాంటి స్పందన కనిపించలేదు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లో కూడా ఎలాంటి ప్రభావం కనిపించలేదు. అయితే నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఉదయం నుంచే అప్రమత్తంగా ఉండడం, టీడీపీ నాయకులను హౌస్ అరెస్ట్ చేయడంతో ఎవరూ రోడ్ల మీదకు రాలేదు. పార్టీ కార్యాలయంలోనే వారి ఆందోళనను తెలిపారు. అయితే నాయుడుపేట పట్టణంలోని కందల కృష్ణారెడ్డి అనే నాయకుడు ఉదయాన్నే దుకాణాలు, విద్యాసంస్థలు మూయించే కార్యక్రమం చేస్తుంటే పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. నాయుడుపేటలో నెలవల సుబ్రమణ్యం, ఎస్ విజయభాస్కర్‌రెడ్డి తదితర నాయకులను అరెస్టు చేశారు. సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న పరసా వెంకటరత్నయ్య రిలే నిరాహారదీక్ష చేస్తున్నారని తెలిసి పోలీసులు అక్కడకు వెళ్లే సరికి ఆయన పరారయ్యారు. ఆ తరువాత వేనాటి సతీష్ రెడ్డి తన మంది మార్బలంతో పట్టణంలో ర్యాలీ చేశారు. వెంటనే డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌ఐ రవిబాబు, శ్రీనివాసులురెడ్డి, మనోజ్‌కుమార్ సిబ్బంది వచ్చి, వారిని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. సోమవారం సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి ఆ తరువాత విడుదల చేశారు. అంటే బంద్ ప్రభావం ఎక్కడా కనిపించకపోవడం విశేషం.

144 సెక్షన్ అమలులో ఉంది

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 144 సెక్షన్ అమలులో ఉందని ఎవరు ఉల్లంఘించిన చర్యలు తప్పవంటూ సీఐ నరసింహారావు హెచ్చరికలు చేశారు. ఒకరిద్దరికి మించి గుమి కూడరాదని, అనుమతులు లేకుండా ర్యాలీలు, నిరసన ప్రదర్శలు చేయకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిని బైండోవర్ చేసుకుని, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు. సూచనలను పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

పెళ్లకూరులో యథావిధిగా కార్యకలాపాలు

పెళ్లకూరు: మండలంలో బంద్ ఊసే లేదు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణయ్య, సర్పంచ్‌లు దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, శివకుమార్, మునీష్‌తోపాటు పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, హరినాయుడు, బెన్నీ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే తాళ్వాయిపాడు గ్రామంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మూసేందుకు టీడీపీ నాయకులు చేసిన యత్నాలు ఫలించలేదు. నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్‌ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి గట్టి చర్యలు చేపట్టారు.

వెంకటగిరిలో బంద్ ప్రభావం నిల్

వెంకటగిరిరూరల్: పట్టణంలో బంద్ ప్రభావం కనిపించలేదు. పాఠశాలలు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, రవాణా తదితర వ్యవస్థలు యథావిధిగా కొనసాగాయి. 144 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా వెంకటగిరి, బాలాయపల్లె ఎస్‌ఐలు నరసింహారావు, వీరనారాయణ ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. పట్టణంలో బంద్ నిర్వహించేందుకు ఎవరు ముందుకు వచ్చేందుకు సుముఖత చూపలేదు.

బంద్ పేరుతో దౌర్జన్యానికి పాల్పడితే కఠిన చర్యలు

గూడూరురూరల్: బంద్ పేరుతో దౌర్జన్యానికి పాల్పడినా, జన జీవనానికి ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ, జనసేన బంద్‌కు పిలుపునిచ్చినా సోమవారం గూడూరులో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించడంతోపాటు జనజీవనం యథావిధిగా కొనసాగింది. బంద్ సందర్భంగా గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద పరిస్థితిని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పరిశీలించి, పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ గూడూరులో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించడం లేదని, యథావిధిగా ఆర్టీసీ బస్సులు, ప్రజల రాకపోకలు సాగుతున్నాయన్నారు. డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా నలుగురికి మించి ఎక్కువ మంది ఉండకూడదన్నారు. చట్టవ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బలవంతంగా ఎక్కడైనా దుకాణాలను, కార్యాలయాలను మూయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సీఐ దశరథరామారావు, ఎస్‌ఐ నారాయణరాజు, సిబ్బంది ఉన్నారు.


సూళ్లూరుపేటలో తెరిచి ఉన్న దుకాణాలు


వెంకటగిరిలో పోలీసు పికెట్


గూడూరులో యథావిధిగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కళవలపూడిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయంగా పని చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరిరూరల్ మండలంలోని కళవలపూడి పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో అపూర్వ స్వాగతం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు వారు పొందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. స్థానికంగా వచ్చిన సమస్యలను సత్వర పరిష్కర దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో అన్నీ వర్గాల ప్రజలు ఆనందంగా జీవనం గడుపుతున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుంతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగయ్య, కే శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ బత్తయ్య, వైస్ ఎంపీపీ పెంచలయ్య, జేసీఎస్ కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, నాయకులు జి సురేష్, అంకయ్య, సుబ్బరామ య్య, రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, వి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం, ధర్మం గెలిచింది


కేక్ కట్ చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో న్యాయం, ధర్మం గెలిచిందని వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ పరిశీలకుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పసుపుకండ్రిగలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు మూలకారకుడైన చంద్రబాబుకు న్యాయదేవత సరైన శిక్ష వేస్తుందన్నారు. రాష్ట్రంలోని పలువురు మేధావులు, వివిధ వర్గాల ప్రజలు చంద్రబాబు అరెస్టును స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు మునివర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మణినాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం


గూడూరులో ఆర్డీఓకు అర్జీ అందజేస్తున్న మహిళ

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. గూడూరు డివిజన్‌లోని పలు మండలాల నుంచి ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. చిల్లకూరు, చిట్టమూరు, తదితర మండలాల్లో భూ సమస్యలు, ఇంటి స్థలం ఆక్రమించారని, న్యాయం చేయాలని పలువురు అర్జీలను అందజేశారు. వెంటనే స్పందించిన ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆయా మండలాల తహసీల్దార్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం

సైదాపురం: స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చేవారు సంతృప్తికరంగా చెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రాధ, ఏఓ హైమావతి, ఏఈ భాస్కర్, వైద్యాధికారులు జనార్దన్‌రావు, శ్రావణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం


తగుల బెట్టిన ముళ్ల కంచెను తొలగించేందుకు వెళ్లిన పోలీసులను అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

చిల్లకూరు(చిట్టమూరు): చంద్రబాబుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడడంతోపాటుగా ఏకంగా పోలీసులపైనే తిరగబడిన సంఘటన చిట్టమూరు మండలం మొలకలపూడి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. టీడీపీ రాష్ట్రబంద్ పిలుపుమేరకు గూడూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు బంద్ చేపట్టాలని చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేసేలా మూరుమాల గ్రామాల్లో అలజడులు సృష్టించాలని మొకలకలపూడి వద్ద రోడ్డుపై ముళ్ల కంపలు వేసి తగులబెట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపి అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించగా పోలీసులపైకి టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా తిరగబడి వారిని అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు టీడీపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగి, తోసులాడుకున్నారు. దౌర్జన్యానికి దిగిన 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు

చిల్లకూరు(చిట్టమూరు): టీడీపీ బంద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 144వ సెక్షన్ అమలు చేశారు. అయితే టీడీపీ నాయకులు 144వ సెక్షన్‌ను తుంగలో తొక్కి అలజడి సృష్టించే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారి కేసులు నమోదు చేశారు. వీఆర్వో శివయ్య ఫిర్యాదు మేరకు మొలకలపూడి వద్ద రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు వేసి తగుల బెట్టి, ప్రజా జీవనానికి విఘాతం కలిగించే ప్రయత్నించిన రాజగోపాల్‌రెడ్డి, వెంకటరమణ, సురేష్, పట్టాభి, వెంకటేశ్వర్లుతో పాటుగా మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా శ్రీకాళహస్తీశ్వరుడి కల్యాణం


శ్రీకాళహస్తీశ్వరస్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో ఉన్న స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో సోమవారం జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ధర్మప్రచారంలో భాగంగా శ్రీకాళహస్తీశ్వరస్వామివారి ధర్మప్రచార రథం సోమవారం రాత్రి దేవునివెల్లంపల్లెకు చేరుకుంది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం పురోహితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 14వ వార్డు పరిధిలో తన దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తామని కౌన్సిలర్ శంకరయ్య తెలిపారు. సోమవారం ఆ వార్డులోని సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో ఇప్పటి వరకు వచ్చిన అర్జీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

13 నుంచి క్రీడాపోటీలు

ఓజిలి: మండలంలోని వాకాటివారికండ్రిగలోని ఏకలవ్యా గురుకుల పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓలు శైలజ, చంద్రయ్య తెలిపారు. ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాపూరులో..

రాపూరు: మండలస్థాయిలో ఈనెల 13 తేదీల్లో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దయాకర్ రావు తెలిపారు. ఈ పోటీల్లో 14-17 ఏళ్ల లోపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ రమేష్ 94401 96596 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నకిలీలను అరికట్టేందుకే ల్యాబ్‌కు


పురుగు మందుల శాంపిళ్లను పరిశీలిస్తున్న ఏఓ భవానీ

చిల్లకూరు: రైతులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతి దుకాణంలోని వివిధ కంపెనీల పురుగు మందులను ల్యాబ్‌కు పంపి నిర్ధారణ చేస్తున్నట్లు ఏఓ భవానీ తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువులు దుకాణాల్లో విక్రయించే క్రిమిసంహారక మందుల శాంపిళ్లను సేకరించి, ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేశారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో నకిలీ పురుగు మందులు ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రతి దుకాణంలో విక్రయించే మందుల శాంపిళ్లు తీసి, అగ్రి ల్యాబ్‌లకు పంపి, అక్కడ నిర్ధారణ చేసుకున్న అనంతరమే వాటి విక్రయించేలా చర్యలు తీసుకుంటుందని అన్నారు.

క్రీడాపోటీలు జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ కాంచన

గూడూరురూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరుగనున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడాపోటీలను జయప్రదం చేయాలని ఎంఈఓలు సనత్‌కుమార్, కాంచన కోరారు. ఎమ్మార్సీలో సోమవారం హెచ్‌ఎంలు, పీఈటీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 13వ తేదీన అథ్లెటిక్స్, 14న కబడ్డీ, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, 16వ తేదీ త్రోబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 21 తేదీ నుంచి గూడూరు నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త వి.ఆర్.శివకుమార్, హెచ్‌ఎం భారతి, పి.కరిముల్లాఖాన్ పాల్గొన్నారు.

గుళికలు తిని మహిళ మృతి

చిల్లకూరు: మండలంలోని వరగలి గ్రామానికి చెందిన ఓ మహిళ విష గుళికలు తిని, మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని వరగలి గ్రామానికి చెందిన మానికల కోటమ్మ(48) అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం మండలంలోని పల్లమాలలో జరిగే ఓ శుభ కార్యంలో పనికి వెళ్లింది. అక్కడ పని చేసిన అనంతరం ఆమె గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి గిరిజన కాలనీకి వెళ్లింది. ఏమి జరిగిందో కానీ విష గుళికలు తిని అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించిన స్థానికులు హుటాహుటిని గూడూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

15 లోపు మార్పులు, చేర్పులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: గ్రామాల్లో ఓటర్ల చేర్పులు, తొలగింపులను ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని బీఎల్వోలకు తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రతి ఒక్కరు ఫామ్ 8 పూర్తి చేసి అందించారని, ఈ రెండు రోజుల్లో ఫామ్ 6, 7ను పూర్తి చేసి, ఓటర్ల జాబితా ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. జనవరిలో మరోసారి నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించే అవకాశం ఉన్నందున 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ మస్తానయ్య, ఆర్‌ఐ రమ్యస్వాతి, ఏఎస్ఓ బాషా పాల్గొన్నారు.